

# పుస్తక పరిచయం




**ఆంధ్రప్రదేశ్** శాసనసభ ఉప సభాపతి శ్రీమండలి బుద్ధప్రసాద్‌గారు, వారి నాన్నగారు స్వర్గీయ మండలి కృష్ణారావుగారు కేవలం రాజకీయవేత్తలేకాక, చక్కటి సాహితీప్రియులు కూడా. అంతేకాదు, నూటికి నూరుశాతం గాంధేయవాదులు. వారి స్వస్థలమైన అవనిగడ్డలో గాంధీక్షేత్రాన్ని గత కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. మహాత్మాగాంధీ బోధించిన గ్రామసుపరిపాలనకు సంబంధించిన అనేక కార్యక్రమాలను కూడా చేపట్టారు. ఇప్పుడు మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా మండలి బుద్ధప్రసాద్‌గారు ఒక అద్భుతమైన ప్రణాళికకు రూపకల్పనచేసి, అమలుపరచారు. అదే ఈ పుస్తకం "తెలుగు కథల్లో గాంధీ మహాత్ముడు" . బుద్ధప్రసాద్‌గారి ఆలోచనలకు రూపం ఇచ్చిన వారు ప్రముఖ రచయిత కస్తూరి మురళీకృష్ణగారు, కోడీహళ్ళి మురళీమోహన్‌గారు. శతాబ్దంపైగా తెలుగు సాహిత్యంలో మహాత్మాగాంధీ గురించి, ఆయనబోధించిన అంశాలగురించి, ఆయన కలిగించిన ప్రభావం గురించి వచ్చిన కథలను పరిశీలించి, అందులోంచి ఎంపికచేసిన 30 కథలతో ఈ సంకలనాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఈ బృహత్కార్యక్రమాన్ని కేవలం నెలన్నరలో పూర్తిచేయడం గమనార్హం. ఇందులో 1921 భారతి పత్రికలో గుమ్మడిదల దుర్గాబాయిగారు వ్రాసిన 'నే ధన్యనైతిని' కథనుంచీ ఎమ్.సుగుణరావుగారు 2018లో నవ తెలంగాణా పత్రికలో వ్రాసిన 'గెలుపు' కథ వరకూ - ఈ వందేళ్ళలో వివిధ దశల్లో మహాత్మాగాంధీ కేంద్రంగా వచ్చిన కథలున్నాయి. మహాత్మాగాంధీలాంటి వ్యక్తులు వారు జీవించిన కాలానికి సంబంధించిన వ్యక్తులు మాత్రమే కాదు, అలాంటివారు మరణించీ జీవిస్తున్న మహాపురుషులు. అందుకే గాంధీ మరణించిన 70 సంవత్సరాల తర్వాత (మరి కొన్ని శతాబ్దాలుగాకూడా ఇది కొనసాగుతుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు) కూడా ఆయన జీవన శైలిగురించి కానీ, ఆయన బోధించి, ఆచరించిన జీవనసత్యాల గురించికానీ కథలు వస్తూనే ఉన్నాయి. మురళీకృష్ణగారు, మురళీమోహన్‌గారు ఇందులోని కథలను అర్థవంతంగా వర్గీకరించారు. స్వాతంత్ర్యపోరాట సమయంలో వచ్చిన కథలను సత్యాగ్రహం, అహింస, స్వదేశీ, అస్పృశ్యత నివారణ, వ్యక్తిత్వం, దేశవిభజన అనీ - స్వాతంత్ర్యానంతరం వచ్చిన కథల్లో ఓ 12 కథలనూ విభాగాలుగా విభజించారు. తెలుగుకథా సాహిత్యంలో ఉత్తమోత్తమమైన రచనలు చేసిన కథకులు చాలామంది ఇందులో ఉన్నారు - ఉదాహరణకు: సురవరం ప్రతాపరెడ్డిగారు, కనుపర్తి వరలక్ష్మమ్మగారు, బందా కనకలింగేశ్వరరావుగారు, కాళోజీగారు, చలంగారు, విశ్వనాథగారు, పాలగుమ్మిగారు, కొలకలూరి ఇనాక్‌గారు - ఇలా ప్రముఖులెందరో గాంధీని, గాంధీతత్వాన్ని ఎన్ని కోణాల్లో ఎలా కథనీకరించారో ఈ పుస్తకంలో వివరంగా తెల్సుకోవచ్చు. ఇందులోని కథలను ఒకదాని తరువాత ఒకటిగా చదువుతుంటే మహాత్మాగాంధీ విశ్వరూపంలోని ఒక్కో కోణాన్ని దర్శించిన అనుభూతి కలుగుతుంది. ఇంతచక్కటి, వినూత్నమైన ప్రయోగాన్ని విజయవంతంగా తెలుగుపాఠకులకు అందించిన కస్తూరి మురళీకృష్ణగారిని, కోడీహళ్ళి మురళీమోహన్‌గారిని, వారిని వెన్నుతట్టి ప్రోత్సహించిన మండలి బుద్ధప్రసాద్‌గారిని అభినందించి తీరాలి.

***

***Published by:***
సాహితి ప్రచురణలు
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్.రోడ్, చుట్టగుంట, విజయవాడ
ఫోన్: 0866-2436642




**మెదక్ జిల్లాలోని** సిద్ధిపేట దగ్గరలో ఉన్న రాజగోపాలపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2007 సంవత్సరంలో - కవి. ఉపాధ్యాయుడు భైతి దుర్గయ్యగారు పనిచేశారు. సహజంగానే విద్యాబోధనలో వినూత్న పద్ధతులను ప్రవేశపెట్టడమే కాక విద్యార్థుల సర్వతోముఖ వికాసం కోసం వివిధప్రణాళికలు అమలుపరచారు దుర్గయ్యగారు. అందులో ఒక భాగమే ఆ రోజుల్లో ఆయన స్కూలు పిల్లలకోసం, స్కూలు పిల్లలచేతనే నిర్వహింపచేసిన పక్షపత్రిక ‘అక్షర‘. దశాబ్దంక్రిందటే దుర్గయ్యగారు చేసిన ఈ వినూత్న, విజయవంతమైన ప్రయోగాన్ని అభినందించి తీరాలి. అప్పట్లో ఈ పక్షపత్రిక ఒక సంవత్సరంపాటు నిరాటంకంగా నడిచింది. అప్పటి విద్యార్థులకు ఒక తీపిజ్ఞాపకంగా మిగిలిపోయిన అప్పటి ‘అక్షర‘ పక్షపత్రిక సంచికలను అన్నింటినీ కలిపి ఒక పుస్తకంలా తీసుకొచ్చారు ఇటీవల. అప్పట్లోనే ఈ ‘అక్షర‘ పత్రికను రెండు పేజీల్లో పది శీర్షికలతో నడపడం అభినందనీయం. పైగా - ఒక్క సంపాదకీయం తప్ప మిగతా శీర్షికలన్నింటినీ విద్యార్థులే నిర్వహించడం, వారి రచనలతోనే ఈ పక్షపత్రికను నింపడం కూడా గమనించదగ్గ విశేషం. పక్షం రోజులలో జరిగిన జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ క్రీడా విశేషాలు విజ్ఞానాన్ని కలిగిస్తే, మెదడుకు పదునుపెట్టే పదకేళి సమస్య, పజిల్లు, నైతిక విలువలు పెంపొందించే నీతికథలు, మహనీయుల సూక్తులు, ప్రేరణకలిగించే ఆదర్శవిద్యార్థి శీర్షిక, ఆలోచింపచేసే జనరల్ నాలెడ్జిప్రశ్నలు,, కవితలు, పాఠశాల విశేషాలు.. ఇలా కేవలం రెండుపేజీల్లోనే సమగ్రతను సాధించడం కూడా ఈ చిన్నారి పత్రిక గొప్పతనం. ఓ దశాబ్దం తర్వాత పాతవిద్యార్థుల కోరికమేరకు వాటన్నింటినీ కలిపి ఈ రూపంలో అందరికీ అందుబాటులో తెచ్చిన ఉపాధ్యాయులు భైతి దుర్గయ్యగారు అభినందనీయులు.

***

***For Copies***

Bhati Durgayya
Teacher
Phone: 995900 7914
Siddhipet

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**